క్లుప్తంగా

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

గుడిపాల: మండలంలోని కిల్లారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తల్లులు తమ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. ఆయన మాట్లాడుతూ, పిల్లలు బాగా చదవాలన్నారు. అలాగే ఆటపాటల్లోనూ చురుగ్గా ఉంటాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాణి, ఉపాధ్యాయులు శ్రీదేవి, తులసి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంఈఓలు

ఐరాల: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ తెలిపారు. గురువారం కాణిపాకం హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రుష్యేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 దామోదర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళెం సీడీపీఓగా వినుతశ్రీ



బంగారుపాళెం: బంగారుపాళెం ఐసీడీఎస్ సీడీపీఓగా వినుతశ్రీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న వాణిశ్రీదేవి పులిచెర్లకు వెళ్లారు. పాలసముద్రంలో పని చేస్తున్న వినుతశ్రీ ఇక్కడికి బదిలీపై వచ్చారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కింది స్థాయి సిబ్బందితో కలసి తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితం



తెల్లగుండ్లపల్లెలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లేపల్లిలో సామూహిక సీమంతాలు



పిల్లలకు అక్షరాభ్యాసం

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సామూహిక సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహిస్తామన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించారు. అలాగే ఇంటి పరిసరాలలో లభించే పండ్లు, వివిధ రకాల కూరగాయల నుంచి పౌష్టికాహారం తయారుచేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గంగయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజే కష్టబడి

అరకొరగా పాఠ్యపుస్తకాలు



ముద్దకట్టిన అన్నం



నీరు సరఫరా కానీ కొళాయి



వేసవి సెలవులు ముగిశాయి. ప్రభుత్వ స్కూళ్లు తెరుచుకున్నాయి. సమస్యలతో స్వాగతం పలికాయి. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం భోజనం ముద్దకట్టింది. అరకొర పుస్తకాలతో తొలిరోజు బడి సమాప్తమైంది. యూనిఫాం కరువయ్యాయి. ప్రభుత్వం స్కూళ్లను సర్దుబాటు చేయడంపై తల్లిదండ్రులు మండిపడ్డారు. రోడెక్కి నిరసనలు చేశారు.

- మొదటి రోజు సమస్యలతో స్వాగతం పలికిన స్కూళ్లు
- చాలా స్కూళ్లకు అందని పుస్తకాలు
- విద్యార్థులకు ఇవ్వని యూనిఫాం
- అసంపూర్తిగా దర్శనమిచ్చిన తరగతి గదులు
- స్కూళ్ల సర్దుబాటుతో రోడ్డెక్కిన తల్లిదండ్రులు



విద్యార్థులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న తరగతి గది

కాణిపాకం: వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు పునఃప్రారంభమయ్యాయి. అయితే సమస్యలన్నీ ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మౌలిక వసతుల విషయంలో ఇబ్బందులు విద్యార్థులు ఎదుర్కొన్నారు. తరగతి గదుల కొరత వేధిస్తోంది. పాఠశాల బోధన గందరగోళంగా మారింది. ఇక పాడ్యమి ఎఫెక్ట్‌తో చాలామంది పిల్లలకు స్కూళ్లకు హాజరు కాలేదు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 502 ప్రాథమిక, 78 ప్రాథమికోన్నత, 122 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 30 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

కానుకలు కరువు..

గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు పునః ప్రారంభం నుంచే విద్యాకానుకలు ఇచ్చేవారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, షూ, టై వంటి వాటితో మరిన్ని బ్యాగుతో పాటు జత చేసి విద్యాకానుక అందించేవాళ్లు. దీంతో పేద పిల్లలు కార్పొరేట్ తరహాలో ఇష్టంగా బడికెళ్లేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కానుక ఆలస్యమైంది. ఈ ఏడాది కూడా కానుకలు అరకొరగా వచ్చాయి. కొన్ని స్కూళ్లకు ఇంకా పుస్తకాలు రాలేదు. మరికొన్ని స్కూళ్లకు అరకొరగా వచ్చాయి. యూనిఫాం కూడా ఇవ్వలేదు. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అయోమయంలో పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్కూళ్లకు సన్నబియ్యం పంపిణీ చేసి మధ్యాహ్నం వడ్డిస్తామని ప్రకటించింది. అయితే ఆ బియ్యంతో వడ్డించిన అన్నం చూసి పిల్లలు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సర్దుబాటుపై మండిపాటు..

కూటమి ప్రభుత్వం క్లస్టర్ల పేరుతో స్కూళ్లను సర్దుబాటు చేస్తోంది. ఈ వ్యవస్థపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వ్యవస్థను రద్దు చేసి యథావిధిగా బడులను తెరిపించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలంలోని అనంతాపురం, మురకంబట్టు, యాదమరి మండలంలోని ముస్లింవాడ తదితర ప్రాంతాల్లో స్కూళ్ల సర్దుబాటుపై విద్యార్థుల తల్లిదండ్రులు రోడెక్కి నిరసన వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

పాడ్యమి ఎఫెక్టు

బంగారుపాళెం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బుధవారం పౌర్ణమి, గురువారం పాడ్యమి కావడంతో పాఠశాలల ప్రారంభం రోజున పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు సుముఖత చూపలేదు. పాఠశాలలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో రాలేదు. ఉపాధ్యాయులు కూడా బదిలీల కారణంగా పాఠశాలలకు హాజరు కాలేదు.

నేడు మండలమీట్

తవణంపల్లె: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

మద్దతు ధరకే మామిడి కొనాలి



నలగాంపల్లెలో సన్‌గోల్డ్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ భవాని

బంగారుపాళెం: జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు తోతాపురి మామిడిని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి కొనుగోలు చేయాలని పలమనేరు ఆర్డీఓ భవాని ఆదేశించారు. గురువారం మండలంలోని నలగాంపల్లెలో ఉన్న సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తోతాపురి రకానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను విధిగా అమలు చేయాలని ఫ్యాక్టరీ యజమానులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు మద్దతు ధర అమలయ్యేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రసాద్

తవణంపల్లె: మండలంలోని దిగువమోదలపల్లె మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా ప్రసాద్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బంగారుపాళ్యం మండలంలోని బోడబండ్ల హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ దిగువమోదలపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై విచ్చేశారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం మొగిలప్పనాయుడు మండలంలోని కర్నంవాండ్లవూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు.

మేక్ ఇన్ ఇండియాకు ప్రాధాన్యత

చిత్తూరు కార్పొరేషన్: దేశంలో బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, అలాగే మేక్ ఇన్ ఇండియా పేరిట పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎక్కువగా రవాణా వ్యవస్థకు పెద్దపీట వేసి, లక్షల కోట్లతో వేల కిలోమీటర్ల రోడ్లు వేస్తోందని, రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు అమృత్‌భారత్ కింద నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా నినాదంతో ఎగుమతుల శాతం పెంచిందన్నారు. పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి మన సైనిక సత్తా ఏమిటో చాటి చెప్పిందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్రనాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, నాయకులు రామభద్ర, సత్య పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు



గాంధీవిగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం గాంధీవిగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయడానికి చేస్తున్న యత్నాలను విరమించుకోవాలని, ఫ్యాక్టరీలో తొలగించిన 2500 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నష్టాల సాకుతో పరిశ్రమను మూసివేయాలని చూస్తోందని విమర్శించారు. మన రాష్ట్రానికి గర్వకారమైన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునే విషయంలో పాలకులు శ్రద్ధ చూపకపోవడం, కేంద్రంపై ఒత్తిడి తేవకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాకపోగా ఉన్న వాటిని ఇలా మూసివేయడం తగదన్నారు. కార్పొరేట్ శక్తులకు అడుగులకు మడుగులొత్తే విధానాలతో వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, కోదండయ్య, చంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్‌లోని పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ప్రణాళికతో విద్యనభ్యసించాలని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ అన్నారు. డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థి మిత్ర కిట్లను (పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు) పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. విద్యార్థులందరికీ కిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 36వ వార్డు కార్పొరేటర్ హరీష, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ రేష్మ, హెచ్‌ఎం హసన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

పుత్తూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం అందరి బాధ్యతని డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. గురువారం పుత్తూరు మండలం వేపగుంట గ్రామంలో విజయ్‌కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ భాగ్యరాజ్ మాట్లాడుతూ గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. రావి, నేరేడు తదితర రకాలకు చెందిన 120 మొక్కలు నాటామని తెలిపారు. స్థానిక యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, దీపక్, భరత్, తిల్లు, విష్ణు, వెంకట్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



తవణంపల్లె పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ



అరగొండ బాలికల హైస్కూల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

తవణంపల్లె: విద్యార్థులు పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ హేమలత తెలిపారు. గురువారం తవణంపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, డిక్షనరీలు అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులకు యూనిఫాం, షూలు సరఫరా కావాల్సి ఉందన్నారు. అదేవిధంగా అరగొండ బాలికల హైస్కూల్లో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ భాగ్యరాణి, హెచ్‌ఎం మోహన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ తప్పితే ఒక్క విద్యార్థీ రాలేదు..!



మోటుమల్లెల పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో రికార్డులు రాసుకుంటున్న ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి

రొంపిచెర్ల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. అయితే మండలంలోని మోటుమల్లెల ప్రాథమిక పాఠశాలకు తొలిరోజు ఒక్క విద్యార్థి కూడా రాలేదు. ఇక్కడ మొత్తం 13మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క విద్యార్థి కూడా హాజరు కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులను ఆరా తీయగా, పాడ్యమి నడుస్తోందని, ఇది మంచిరోజు కాదని, అందుకే తమ పిల్లలను స్కూళ్లకు పంపలేదని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి చేసేదేమీ లేక రికార్డులు రాసుకుంటూ తొలిరోజు గడిపారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది రా..!



అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల గురించి మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నజ్మా

పలమనేరు: మున్సిపాలిటీలోని లింగాయత్‌వీధి, లక్ష్మణ్‌సింగ్ వీధుల్లో ×అంగన్‌వాడీ పిలుస్తోంది రా¤ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా నిర్వహించారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీల్లోనూ ఇంగ్లిష్ మీడియం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ వార్డు పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర





బంగారుపాళెం దళితవాడలో జలప్రవేశానికి తరలుతున్న గంగమ్మ , జాతరలో భక్తుల సందోహం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మ జల ప్రవేశ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఉట్లమాను అధిరోహించేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ జల ప్రవేశానికి తరలించారు. అలాగే మండలంలోని మొగిలివెంకటగిరి దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జనాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెల్లో వీధిలైట్లు వేయకుంటే ఎలా?

-జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: గ్రామాల్లో కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలని, కనీసం వీధి లైట్లు కూడా వేయకుంటే ఎలా? అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై ఎంపీడీఓ భాస్కర్, సిబ్బందిని ఆరా తీశారు. చాలా గ్రామాల్లో చిన్నపాటి మరమ్మతులు, వీధి దీపాలను కూడా వేయడం లేదనే ఫిర్యాదులు సర్పంచుల నుంచి తమకు వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.